క్లుప్తంగా

సెల్‌ఫోన్లు అందజేత



ఉండవెల్లి: మండల పరిధిలో పోగుట్టుకున్న మొబైల్ ఫోన్లను మంగళవారం ఎస్‌ఐ శేఖర్ బాధితులకు మంగళవారం అందజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు 7 ఫోన్లు రికవరీ చేసి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది హుస్సేన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు సీజ్



అయిజ: జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారులు మంగళవారం మండల కేంద్రంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్, వివిధ రకాల అనుమతుల పత్రాలు పరిశీలించారు. ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సును సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలో మంగళవారం వర్షాలు కురవాలని గ్రామస్తులు కప్ప పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు సమృద్ధిగా ఉండాలంటూ ఇంటింటికీ తిరుగుతూ నీళ్లు పోశారు.

క్షయ నిర్ధారణకు వైద్య పరీక్షలు



మానవపాడు: గ్రామాల్లో క్షయ నిర్ధారణకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యులు రాజు, హేమా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, గురువయ్య, కిరణ్‌కుమార్, ఏఎన్ఎంలు దేవమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరం



మానవపాడు: మండల కేంద్రం పరిధిలో పొలంలో పనిచేస్తున్న బాలుడు కళ్యాణం రాముడును మంగళవారం చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఎస్‌ఐ సయ్యద్‌లాయక్ అలీ, లీగల ఆఫీసర్ శివ బృందం గుర్తించారు. అనంతరం పాఠశాల వద్దకు విద్యార్థిని తీసుకురాగా.. విద్యార్థి ఎంపీపీఎస్‌లో 2023– 24లో 5వ తరగతి పూర్తి చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ అధికారులకు తెలిపారు. బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలని బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ శివ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆటో యూనియన్ కార్మికులతో మాట్లాడారు. సమ్మెకు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివ, అంజి, కృష్ణ, మహ్మద్, వేణు, మద్దిలేటి పాల్గొన్నారు.

సమస్యలు.. సలహాలు.. నివృత్తి

- రైతువేదికల్లో వీసీల ద్వారా అవగాహన
- ప్రతి మంగళవారం 'రైతునేస్తం'
- శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు



తక్కశిలలో వీసీ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

ఉండవెల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సమగ్ర సమాచారం అందించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధిక దిగుబడి, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుంది.

రైతునేస్తంతో సమగ్ర సమాచారం

మండలంలో 15 గ్రామ పంచాయతీల్లోని అందులో 7 క్లస్టర్లలో 7 రైతువేదికలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో మూడు రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీని ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, పట్టు, పాడి, మత్స్య పరిశ్రమ, నీటి పారుదల, పంటల సాగులో తెగులు నివారణ చర్యలు వంటి అనేక అంశాలపై శాస్త్రవేతలు, అధికారుల సలహాలు నేరుగా సూచనలు సలహాలు అందజేస్తున్నారు. మండలంలో మొత్తం 18,500 ఎకరాల్లో 8,500 మంది పైనే రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అధికంగా పత్తి సాగు, మొక్కజొన్న సాగు చేపట్టారు. వీసీలో ముఖ్యంగా పత్తి పంటకు సోకే గులాబి తెగులు, మొక్కజొన్న ఆశించే తెగుళ్ల గురించి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు.

ప్రతి మంగళవారం

ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం ద్వారా రైతువేదికల్లో ఏర్పాటు చేసిన టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కూడా కల్పించారు.

రూ.3 లక్షల నిధులతో

మండలంలోని ఉండవెల్లి, తక్కశీల, కలుగోట్ల గ్రామాల్లోని రైతువేదికల్లో దృశ్య శ్రవణ మాధ్యమాలను(ఆడియో, విజువల్ వీడియో) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని ద్వారా రైతులు నేరుగా శాస్త్రవేతలు, అధికారుల సలహాలను పొందే అవకాశం లభించింది. దాదాపు రూ.3 లక్షలు పైగా వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థలో బీఎస్ఎన్ఎల్, టీఎస్ స్వాన్ వంటి ప్రభుత్వ నెట్‌వర్క్‌లను వినియోగిస్తున్నారు. మండలంలోని మూడు రైతువేదికల్లో ప్రసార కార్యక్రమాలు వెలవడుతున్నాయి.

సమస్యలకు పరిష్కారం

రైతులు శాస్త్రవేత్తలతో ముఖాముఖిలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. ప్రతివారం ఒక నిర్దిష్ట అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. దీంతో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన ఆవిష్కరణలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇది రైతుల ఆదాయాన్ని పెంచడానికి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పుల్లూరులో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

రైతులకు ఉపయోగం



రైతువేదికల్లో నిర్వహిస్తున్న రైతునేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. పంట సమస్యలను వీసీలో నేరుగా శాస్త్రవేతలతో మాట్లాడి పరిష్కరించుకుంటున్నారు. ప్రతి పంటలపై తెగుల నివారణపై జాగ్రత్తలను కూడా తెలుపుతున్నారు.

\- లోకారెడ్డి, రైతు, ఉండవెల్లి

ప్రతివారం 'రైతునేస్తం'



రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. రైతునేస్తం కార్యక్రమం ద్వారా అధికారులు, శాస్త్రవేత్తలతో మాట్లాడే నేరుగా అవకాశం ఏర్పడింది.

\- అనిత, ఏఓ, ఉండవెల్లి

విజయోత్సవాలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరి

గట్టు: ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటేశ్వరి అన్నారు. మంగళవారం ఐకేపీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్వరి మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 16 వరకు ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలు సాధికారతను సాధించేందుకు, మహిళా సంఘాల సభ్యులను కోటీశ్వరులను మార్చేందుకు అనేక జీవనోపాధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరా శక్తి సంబరాల్లో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్, సీసీలు రామకృష్ణ, దేవదాసు, జ్యోతి, సుదర్శన్, శివకుమార్, ఆయా గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తంటాలు



బుడ్డారెడ్డిపల్లిలో పొలంలో బోరువద్ద తాగునీటిని తీసుకెళ్తున్న ప్రజలు

ఇటిక్యాల: మండల పరిధిలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకం నిర్లక్ష్యానికి గురవుతుందని మండిపడ్డారు. అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో చేతి పంపులు, వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు నీటికోసం పరుగులు పెడుతున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్

మల్దకల్: పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను పొలం పనులకు తీసుకెళ్లడం నేరమన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. అదే విధంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సురేఖ

కేటీదొడ్డి: బాలల హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సురేఖ అన్నారు. మండల పరిధిలోని కుచినెర్లలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బాలల పరిరక్షణ సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై బాలల కమిటీ లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. బడి బయట పిల్లను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మ, రంగప్ప, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి

అమరచింత: కేజీబీవీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు రాజేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయికుమార్ ఆరోపించారు. మంగళవారం కేజీబీవీని సందర్శించి వారు మాట్లాడుతూ.. విద్యార్థినులకు సరిపడా ఆహారం అందించడం లేదని, అంతే కాకుండా వంట ఏజెన్సీ మహిళలు విద్యార్థులను తిడుతున్న సంబంధిత ఎస్‌ఓ పట్టించుకోకపోవడం దారుణంగా ఉందని పేర్కొన్నారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం



అయిజ: మున్సిపాలిటీ సమీపంలోని తూంకుంట రోడ్డు పక్కన నిర్మించిన జములమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నించినట్లు ఆలయ పూజారి వెంకటేష్ తెలిపారు. మంగళవారం పోలీసులకు సమాచారమిచ్చినట్లు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి శిక్షణకు గద్వాల విద్యార్థి



గద్వాలటౌన్: ఈ నెల 8వ తేదీ నుంచి హైదరాబాద్‌లోని జింఖాన క్రీడా మైదానంలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరానికి గద్వాలకు చెందిన విద్యార్థి వీరేష్ ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవుతున్న వీరేష్ గత నెల 28న నిజాంబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్– 15 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటారు. వీరేష్ ఎంపికపై డీవైఎస్‌ఓ జితేందర్, పాఠశాల హెచ్ఎం రేణుకాదేవి, ఫిజికల్ డైరెక్టర్లు హైమావతి, బీసన్న హర్షం తెలిపారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

గట్టు: మొహర్రం వేడుకల్లో భాగంగా చివరి అంకం మౌలాలి పీరు ఊరేగింపు మంగళవారం గట్టు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జామియా మసీదు నుంచి కమ్మరి వీధిలోని మసీదు వరకు ఊరేగించారు. ఊరేగింపులో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు

అయిజ: గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 10న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మండల కేంద్రంలోని అయ్యప్ప, సాయిబాబ స్వామి ఆలయాల నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

నేడు విద్యుత్ ఉద్యోగుల విధులు బహిష్కరణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను ఖండిస్తూ ఈనెల 9న జిల్లా వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు విధులు బహిష్కరించనున్నట్లు విద్యుత్‌ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ భవన్, జడ్చర్ల డివిజన్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని, దాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రేషన్‌కార్డు కోసం చక్కర్లు



గట్టు తహసీల్దార్ కార్యాలయంలో వేచిఉన్న ప్రజలు

గట్టు: రేషన్ కార్డుల కోసం మండల ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తులను రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు గట్టు, మాచర్ల గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు మంగళవారం వైరల్‌గా మారింది. రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తుల తహసీల్దార్ కార్యాలయంలో అందజేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని దరఖాస్తుదారులు వాపోయారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు కొత్తరేషన్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని గట్టు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాచర్ల మహబూబ్ విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. కొత్త రేషన్ కార్డుల వ్యవహారంపై ఇప్పటి దాకా 60 శాతం దరఖాస్తులపై విచారణ పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కరువు



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనంలో సౌకర్యాలు లేవని అదే విధంగా సరైన పుస్తకాలు లేవని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని గ్రంథాలయ భవనాన్ని బీఆర్ఎస్వీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. రోడ్డు పక్కన ఏర్పాటు చేయడం వలన శబ్దకాలుష్యంతో పాఠకులు, ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. సరిపడా కుర్చీలు లేవని మండిపడ్డారు. గ్రంథాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి, వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాధవ్ రాజు, చంద్రశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి



సభ్యత్వాలను అందజేస్తున్న రమేష్

అలంపూర్: ఉపాధ్యాయ, ఉద్యోగ బకాయి బిల్లులు తక్షణమే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రమేష్ ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. మండలంలో 60 మంది ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 2023 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల డీఏను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు రాముడు, బయ్యన్న, రాజ్‌కుమార్, ఎల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మానవపాడులో మాట్లాడుతున్న డాక్టర్ హేమమానస



ఇటిక్యాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రాధిక

ఇటిక్యాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహజ కాన్పులపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కార్యక్రమాలు గ్రామాల్లో వందశాతం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తమ డిమాండ్ల పరిష్కారానికి ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు గురువారం సమ్మె నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సహజ కాన్పులు ప్రోత్సహించాలి

మానవపాడు: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సహజ కాన్పులు ప్రోత్సహించాలని డాక్టర్ హేమ మానస, డాక్టర్ హేమలత అన్నారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. గర్భిణులు ఎర్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెలెన్, అబేదుల్ల, అక్కమ్మ, వీణసాయి, యాకుబ్, సంధ్య, అనుష, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా టు పాలమూరు



ఇటీవల ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న గంజాయి

మహబూబ్‌నగర్ క్రైం: 'గంజాయి విక్రయదారులు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు.. చాక్లెట్లు, సిగరెట్, ఆయిల్ రూపంలో ఇలా భిన్నంగా ఆలోచిస్తూ మత్తును చేరవేస్తున్నారు. ఒక్కసారి ఆ మత్తుకు అలవాటుపడిన యువత బయటకు రావడం చాలా కష్టంగా మారుతోంది. చివరికి దాడులు చేసుకోవడం, ఇతర నేరాలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడుతూ.. తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. బాధితుల్లో 18 నుంచి 30 ఏళ్లలోపు వారే అధికంగా ఉండటం విచారకరం.

గ్రాముల చొప్పున విక్రయం..

ప్రధానంగా పాలమూరుకు సరఫరా అవుతున్న ఎండు గంజాయిలో అధిక శాతం ఒడిశా నుంచి వస్తుంటే.. మరికొంత హైదరాబాద్‌లోని ధూల్‌పేట్ నుంచి వస్తోంది. దీనిని ఒక కేజీ గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి.. దాంట్లో నుంచి ఐదు నుంచి ఆరు గ్రాములను ఒక పాకెట్‌గా ఏర్పాటు చేసి రూ.500 నుంచి రూ.700లకు విక్రయిస్తున్నారు. పోలేపల్లి సెజ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో పని చేసే ఒడిశాకు చెందిన కూలీలు కొంత రవాణా చేస్తుంటే దీని సరఫరాను అడ్డుకోవడానికి పోలీసులు, ఎక్సైజ్ అధికారులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కళాశాలలు, కాలనీల్లో విద్యార్థులు, యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

దాబాల్లోనూ విక్రయాలు..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదు కాగా 975 గ్రాముల ఎండు గంజాయి, 8 మంది అరెస్టు చేయడంతో పాటు మూడు వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. అలాగే జడ్చర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు నమోదు కాగా పది మంది అరెస్టు చేయగా రెండు కేజీల 650 గంజాయి, 8 సెల్‌ఫోన్లు, ఒక వాహనం సీజ్ చేశారు. జడ్చర్ల పరిధిలో జాతీయ రహదారి వెంట ఉన్న దాబాల్లో గంజాయి విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఇటీవల షాద్‌నగర్– బాలానగర్ మధ్యలో ఉన్న దాబాల్లో గంజాయి దొరకడమే ఇందుకు నిదర్శనం. రాజాపూర్ నుంచి టోల్‌గేట్ మధ్యలో ఉన్న కొన్ని హోటళ్లు, దాబాల్లో బయటి వ్యక్తులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

బానిస కావాల్సిందే..

ఎవరైనా మత్తు పదార్థాలకు ఒక్కసారి అలవాటుపడితే వాటి నుంచి దూరం కావడం అసాధ్యం. ఆ మత్తుకు అలా బానిస కావాల్సిందే. కేవలం మత్తును ఆస్వాదించడం కోసమే వినియోగించే డ్రగ్స్‌ను ఆస్పత్రుల్లో శస్త్రచికిత్స చేసే సమయంలో రోగులకు నొప్పి తగ్గడానికి వైద్యులు అవసరమైన మోతాదులో రోగులకు ఇస్తుంటారు. ఇలాంటి డ్రగ్స్‌ను అవసరమైన దానికంటే ఎక్కువగా ఉపయోగిస్తే మనిషిపై తీవ్ర ప్రభావం చూపించడంతో పాటు నిత్యం కావాలనిపిస్తుంది. ఇలాంటి మత్తును రుచి చూసిన వారు జీవితాంతం కావాలని కోరుకుంటారు. ఇలాంటి మత్తు ఇంజెక్షన్ల వల్ల పూర్తిగా నరాల వ్యవస్థను దెబ్బతీయడంతోపాటు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తుంది. అలాగే మత్తు అత్యవసరమైన సమయంలో అందుబాటులో లేకపోతే విచక్షణ కోల్పోయి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే అవకాశం లేకపోలేదు.

కేసులు నమోదు..

జిల్లాలో గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిపెట్టాం. కొన్ని ప్రత్యేక కాలనీల్లో యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం రాగానే తనిఖీలు చేస్తున్నాం. జాతీయ రహదారితో పాటు దాబాల్లో కూడా ప్రత్యేక బృందాలు నిత్యం తనిఖీలు జరుపుతున్నాయి. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

\- సుధాకర్, జిల్లా ఎక్సైజ్ అధికారి